క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డికి సత్కారం



మంత్రి పెద్దిరెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ ఆర్‌వీఎం. నిర్మల

తిరుపతి మంగళం: ద్రవిడ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలిగా నియమితులైన డాక్టర్ ఆర్‌వీఎం.నిర్మల ఆదివారం మారుతీనగర్‌లోని మంత్రి నివాసంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

6న పిల్లలకు వేషధారణ పోటీలు

తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5 గంటలకు వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్టు వంశీ కళాక్షేత్రం వ్యవస్థాపకుడు జీఎల్.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలు ఇందులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.2116, రూ.1116, రూ.516తోపాటు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 7893063900, 9441394425లో సంప్రదించాలని సూచించారు.

ప్రయాణికులతో గౌరవంగా నడుచుకోండి

తిరుపతి అర్బన్: ప్రయాణికులతో గౌరవంగా వ్యవహరించాలని జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు టికెట్‌కు సరిపడా చిల్లర ఇవ్వడం లేదని కండక్టర్లు దురుసుగా వ్యవహరించడం, రిక్వెస్ట్ స్టాపింగ్‌లో నిలపడంలేదని డ్రైవర్లపై ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. రిక్వెస్ట్ స్టాపింగ్ విషయంలో డ్రైవర్లు ప్రయాణికులతో సహకరించాలని తెలిపారు. ప్రయాణికులకు ఆర్టీసీపై గౌరవం పెరిగేలా ఉద్యోగులు నడుచుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



వరుడు తల్లిదండ్రులకు పెళ్లికానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామచంద్రాపురం: రావిళ్లవారిపల్లి పంచాయతీ బ్రాహ్మణకాల్వలో వివాహం నిశ్చయమైన రంజిత్‌కు ఎమ్మెల్యే చెవిరెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కన్వీనర్ వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ముక్కోటి, సుధాకర్ ఆదివారం అందజేశారు.

డాక్టర్ అపర్ణ బిట్లకు రాష్ట్ర స్థాయి అవార్డు



తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్ల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పలువురిని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు ఎంపిక చేసింది. అపర్ణ బిట్ల 23 ఏళ్లుగా స్విమ్స్‌లో వైద్యురాలిగా, ప్రొఫెసర్‌గా వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం స్విమ్స్ యూనివర్సిటీకి ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా, బయో కెమిస్ట్రీ విభాగాధిపతిగా సేవలు అందిస్తున్నారు.

ముగిసిన కొలుపు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శివాలయం వీధిలో వెలసిన శ్రీకానగలమ్మ కొలుపు ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. మధ్యాహ్నం హరికథా కాలక్షేపం భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రి అమ్మవారికి ఉభయదారులు సారె సమర్పించారు. విశేష అలంకరణలతో శ్రీకానగలమ్మ ప్రత్యేక వాహనంపై ఊరేగుతూ కనువిందుచేశారు.

పులకింపజేసిన భక్తి సంగీతం



శ్రీనివాస కల్యాణం నృత్య ప్రదర్శన ఇస్తున్న పద్మజారెడ్డి బృందం, గానం చేస్తున్న కుమారి శ్రీలలిత



ఆడిటోరియంను ప్రారంభిస్తున్న ఎంపీ గురుమూర్తి



కళా ప్రదర్శనలను తిలకిస్తున్న ప్రేక్షకులు

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన కచ్చపీ ఆడిటోరియాన్ని ఆదివారం టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భక్తి సంగీత, నృత్య కార్యక్రమాలతో స్టేడియం పులకించిపోయింది. సాంస్కృతిక ప్రదర్శనలో తొలి కార్యక్రమంగా సినీ నేపథ్య గాయని శ్రీలలిత నాట రాగంలో మహాగణపతి మనసా స్మరామి... అంటూ కీర్తనను రాగభావయుక్తంగా ఆలపించారు. అనంతరం బ్రహ్మమొక్కటే.. పర బ్రహ్మమొక్కటే తదితర పలు అన్నమయ్య సంకీర్తనలను మధురంగా గానం చేశారు. కాంతారా సినిమాతో సరికొత్త రికార్డు సృష్టించిన 'వరాహ రూపం' పాటను అద్భుతంగా గానం చేసి ఔరా అనిపించారు. ఈ పాటలో ముందుగా వచ్చే ప్లే బ్యాక్ మ్యూజిక్‌ను గాయని శ్రీలలిత లైవ్‌లో వినిపించడంతో ఆడిటోరియం కేరింతలతో ఉప్పొంగింది. అనంతరం వీణ శ్రీవాణి వాద్య సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. చివరిగా ప్రముఖ భరతనాట్య కళాకారిణి, నృత్య విదుషీమణి పద్మజారెడ్డి నృత్య ప్రదర్శన కనువిందు చేసింది. ఈ సంగీత ప్రదర్శనలను అధికారులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధిక సంఖ్యలో ప్రేక్షకులు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.





నృత్య ప్రదర్శన, శ్రీవాణి వీణవాయిద్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ



శోభనకు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రూ.5 లక్షల వైఎస్సార్ బీమా చెక్కు అందజేసి ఆసరా కల్పించారు. తిరుపతి రూరల్ మండలం వెంకటపతి నగర్‌కు చెందిన శ్రీనివాసులు తన స్నేహితులతో కలిసి ఇటీవల తలకోన వెళ్లాడు. అక్కడి టీటీడీ అతిథి గృహంలో బసచేసి అర్ధరాత్రి బయటకు వచ్చే క్రమంలో కాలు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాసులు మృతితో ఆ కుటుంబం ఆర్థికంగా కష్టాలు పడుతోంది. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ చిన్నియాదవ్ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. చెవిరెడ్డి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి వైఎస్ఆర్ బీమా పథకం కింద రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం తుమ్మలగుంటలో శ్రీనివాసులు భార్య శోభనకు రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నియాదవ్, ఎంపీటీసీ నారాయణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సర్పంచ్ కస్తూరికి అభినందనలు



బెంగళూరులో జరిగిన టీబీ ముక్త్ వర్క్‌షాపులో పాల్గొన్న సర్పంచ్ కస్తూరి(ఫైల్)

పాకాల: ఇటీవల బెంగళూరులో నిర్వహించిన టీబీ ముక్త్ పంచాయతీ వర్క్ షాపులో పాల్గొన్న పాకాల సర్పంచ్ ఎస్.కస్తూరిని స్థానిక నాయకులు ఆదివారం అభినందించారు. సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలపై కూడా ప్రసంగించినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ సేవలు బాగున్నాయని డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధులు అభినందించినట్టు తెలిపారు. పాకాల పంచాయతీలో టీబీ రోగులను గుర్తించి వారికి సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సీఎం ప్రవేశ పెట్టిన పథకాలు, వ్యవస్థలతోనే రాష్ట్రాన్ని గుర్తిస్తూ కీర్తిస్తున్నారని కొనియాడారు.

నిరుద్యోగులను మోసం చేసిన మోదీ



ర్యాలీ చేస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి కల్చరల్: ప్రధాని మోదీ నిరుద్యోగులను దగా చేశారని సీపీఎం నేతలు టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర ధ్వజమెత్తారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, అధిక ధరలు తగ్గించాలని, పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు సాగింది. వారు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకూ పెరుగుతోందన్నారు. గత ప్రభుత్వంలో 4.5 శాతం ఉన్న నిరుద్యోగం నేడు 8.5 శాతానికి పెరిగిందన్నారు. దేశవ్యాప్తంగా 25 లక్షల ప్రభుత్వ పరిశ్రమల్లో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటికి నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట తప్పాడన్నారు. దేశానికి నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తానన్న హామీని మరిచి కార్పొరేట్ కంపెనీలకు రూ.8 లక్షల కోట్లు లాభం చేకూర్చేలా రుణాలు రద్దు చేయడం దుర్మార్గమన్నారు. దేశ వ్యాప్తంగా ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర, వేణుగోపాల్, పి.సాయిలక్ష్మి, మాధవ్, రవి, చిన్నబాబు, అక్బర్, కస్తూరి, సత్తివేల్, వాసు, అశోక్, బాలాజీ, పార్థసారథి, మునిరాజా, పవన్ పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్‌కు స్వాగతం



అశ్వర్థ నాయక్‌ను సత్కరిస్తున్న గిరిజన, దళిత సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: టీటీడీ పాలక మండలి సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించేందుకు తిరుపతికి విచ్చేసిన చందే అశ్వర్థ నాయక్‌కు పద్మావతి అతిథి గృహం వద్ద ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ఆధ్వర్యంలో దళిత, గిరిజన సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎన్నడూ లేని విధంగా టీటీడీ పాలక మండలి సభ్యుడిగా అనంతపురానికి చెందిన గిరిజనుడు చందే అశ్వర్థ నాయక్‌కు అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. డాక్టర్ శంకర్ నాయక్, లక్ష్మీరాయ్ నాయక్, శివనాయక్, టీటీడీ ఎంప్లాయిస్ సంఘం నేత భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రమాదేవి ఆస్పత్రిలో ఉచితంగా కీళ్ల మార్పిడి



డీబీ శశిధర్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈహెచ్ఎస్ ద్వారా ఉచితంగా కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్స్‌కు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఆరోగ్య భద్రత స్కీం ద్వారా పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు సైతం ఈ పథకం వర్తిస్తుందన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కుందన నృత్యాలయ నాట్య గురువు వినుత హేమంత్ ఆధ్వర్యంలో కళాకారులు మోనిక, రమ్య, జెన్నీఫర్, తనుజ, నయన, దివ్య, యశశ్విని, దర్శిని, స్నేహ పలు పాటలకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. వారిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న టీటీడీ చైర్మన్ భూమన



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే భూమన



ఆలయ పనులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదివారం తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయ పనులను పరిశీలించారు. ఆలసత్వం చేయకుండా వేగవంతం చేయాలని ఆదేశించారు. మేయర్ శిరీష పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాలు వితరణ



పంచలోహ విగ్రహాలు అందజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఆధ్యాత్మిక వాతావరణంతో పల్లెలు ప్రశాంతంగా ఉంటాయని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ప్రతి పల్లెలోనూ ఆధ్యాత్మిక పరిమళాలను నింపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆయన ఆదివారం చిన్నగొట్టిగల్లు మండలం టి.చట్టేవారిపాలెం పంచాయతీ నలపరెడ్డిగారిపల్లె రామాలయానికి సీతారాములు సమేత లక్ష్మణ, ఆంజనేయ స్వామి పంచలోహ విగ్రహాలను వితరణ చేశారు. వాటిని ఆదివారం తుమ్మలగుంటలో ఆలయ నిర్వాహకులకు అందించారు. ఇటీవల గ్రామంలో చేపట్టిన మహా పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మోహిత్ రెడ్డి ఈ పంచలోహ విగ్రహాలను తయారు చేయించారు. ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు పల్లెలు పట్టుకొమ్మలుగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రతి గ్రామం ప్రజలందరూ ఐకమత్యంగా నిర్వహించుకునే వేడుకల్లో శ్రీరామ భజనలు, సీతారామ కల్యాణం, పట్టాభిషేకం వంటివి ఉంటాయన్నారు. నలపరెడ్డిగారిపల్లె ప్రజలు కలిసికట్టుగా రామాలయం నిర్మించుకోవడంపై అభినందించారు. సోమవారం ఆలయ ప్రారంభోత్సవానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చిన్నగొట్టిగల్లు జెడ్పీటీసీ స్వరూప, వైఎస్సార్ సీపీ నాయకులు మనోహర్, భానుప్రకాష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, విశ్వనాథ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ రఘునాథ, బాలసుబ్రహ్మణ్యం, మునిరామ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బకాసుర వధ



అన్న ప్రసాదాలు తీసుకువెళ్తున్న భీముని వేషధారి

రామచంద్రాపురం: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి సమీపంలో ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బకాసుర వధ ఆకట్టుకుంది. భీముని వేషధారి గ్రామాల్లోకి వెళ్లి అన్న ప్రసాదాన్ని సేకరించి ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాదంగా పంచారు. ఈ క్రమంలోనే భీముడు, బకాసురునితో యుద్ధం చేసి సంహరించడం, కారణ జన్మురాలైన ద్రౌపది మాత ద్రుపదుని ఇంట పుట్టడం వంటి ఘట్టాలను భాగవతారిణి సీతాలక్ష్మీ వీనువిందుగా ఆలపించారు. అనంతరం ఆలయంలోని ద్రౌపది సమేత ధర్మరాజులు మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు, రవికుమార్, ఆలయ అర్చకులు హరిఆచారి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. రాజేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. చంద్రగిరి మండలం కొంగరవారిపల్లికి చెందిన యుగంధర్, మణి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఆకట్టుకున్న బజాజ్ బైక్ రేస్ ప్రదర్శన



విన్యాసాలు చేస్తున్న స్కూటరిస్టులు

తిరుపతి కల్చరల్: బజాజ్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ దక్షిణ భారత దేశంలో మొదటి సారిగా పల్సర్ వాహనం 2.0 ప్రారంభం సందర్భంగా ఎంజీ బ్రదర్స్ షోరూం ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ స్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం బైక్ రేస్ ప్రదర్శనను నిర్వహించింది. ఇందులో డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి, ఎంజీ బ్రదర్స్ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ గోపాలకృష్ణ, బజాజ్ ఆటో రీజనల్ హెడ్స్ కరుణాకరన్, శ్రీనివాసులురెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి బైక్ రేస్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బజాజ్ ద్విచక్ర వాహనాల సంస్థ ద్విచక్రవాహనాల తయారీలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పల్సర్ ద్విచక్రవాహన శక్తి సామర్థ్యాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం బైక్ రేస్‌లో బైక్ అద్భుత విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తిరుపతి టూ వీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి, కిసాన్ ద్విచక్ర వాహనాల ఫైనాన్స్ సంస్థ అధినేత విశ్వనాథ్‌రెడ్డి, బజాజ్ ఆటో ఎంఎస్ఎం.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఉన్న వృద్ధుడికి పింఛను పంపిణీ



ఆసుపత్రిలో ఎల్లప్పరెడ్డికి పింఛను ఇస్తున్న సర్పంచ్, డివిజన్ అధ్యక్షుడు

చంద్రగిరి: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి సర్పంచ్ పింఛను అందజేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని అగరాల పంచాయతీకి చెందిన తూకాకుల ఎల్లప్ప రెడ్డి(76) మెదడులో రక్తం గడ్డ కట్టడంతో తీవ్ర అనారోగ్యానికి లోనయ్యాడు. నెల రోజులుగా తిరుపతి పద్మావతి మల్టీలెవల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి వలంటీరును వెంటబెట్టుకుని ఆదివారం ఆస్పత్రికి చేరుకున్నారు. వేలిముద్రలను తీసుకుని పింఛను అందజేశారు. ఆయన ఆరోగ్యం కుదుట పడేందుకు ప్రభుత్వం నుంచి తగిన సాయం అందిస్తామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మునిరాజ పాల్గొన్నారు.

పురవీధుల్లో విహరిస్తున్న అర్జునస్వామి



పుత్తూరు రూరల్: ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి ఆదివారం పట్టణ పురవీధుల్లో విహరించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం మూడవ ఆదివారం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రెండు ఆదివారాల్లో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషకాలు, పూజలు నిర్వహించి, పురవీధుల్లో ఊరేగించడం ఆనవాయితీ. ఇందులోభాగంగా తొలి ఆదివారం సాయంత్రం జరిగిన ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్ పర్యవేక్షించారు.